సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 6, ఫిబ్రవరి, 2023



సోమశిలలో 67.514 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 67.514 టీఎంసీలు ఉన్నాయి. 1,049 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 3,920, ఉత్తరకాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,660
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,329
3 శాతం జీఎస్టీతో	రూ.5,489
నవర (8 గ్రా)	రూ.43,912

గరిష్టం/కనిష్టం
32.5 /23.0

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. గాలిలో తేమ 65 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్జేడీ సుబ్బారావు

నెల్లూరు(టౌన్): ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 3,369 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 3,246 మంది హాజరయ్యారు. 123 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 18 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. పరీక్ష కేంద్రాలను ఆర్జేడీ సుబ్బారావు, జేడీ రామలింగం సమగ్ర శిక్ష పీఓ ఉషారాణి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

98.88 శాతం మందికి పింఛన్ల పంపిణీ



కోవూరు మండలం వేగూరు సచివాలయం పరిధిలోని ఎం.ఇందిరమ్మకు నగదు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ ఆదివారంతో పూర్తయింది. 98.88 శాతం మంది లబ్ధిదారులకు కానుక అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 3,10,010 మంది లబ్ధిదారులు ఉండగా వలంటీర్లు ఐదు రోజులుగా ఇంటింటికి తిరిగి 3,06,523 మందికి సుమారు రూ.86 కోట్ల నగదును అందజేశారు. వ్యవసాయ పనుల్లో, వ్యాపార సంస్థల్లో పనుల్లో, హాస్పటల్స్‌లో వైద్యసేవలు పొందుతున్న లబ్ధిదారులు అక్కడికే వలంటీర్లు వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక అందించారు.

విలువలతో కూడిన రాజకీయాలు చేయండి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి



మాట్లాడుతున్న బీజేపీ నేత కర్నాటి

నెల్లూరు (బారకాసు): నెల్లూరురూరల్‌లో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు చూస్తుంటే చాలా ఆవేదన కలిగిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. ఏ పార్టీ రాజకీయ నేతలైనా నీతి, విలువలతో కూడుకున్న రాజకీయాలు చేయాలని సూచించారు. ఆదివారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన ఫోన్ ట్యాపింగ్ అవుతుందని చెబుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్టీ అధిష్టానికి ఎందుకు తెలియజేయలేదని ప్రశ్నించారు. తాను మరణించిన తర్వాత తన శవంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా కప్పాలని మాట్లాడిన కోటంరెడ్డి సడన్‌గా యూటర్న్ తీసుకోవడం చూస్తే స్వార్థ రాజకీయాలే కనిపిస్తున్నాయన్నారు. ఎఈ సమావేశంలో పార్టీ నేతలు రాజేష్, విజయ్ కుమార్, పరశురాం, గిరికుమార్‌గౌడ్, కాయల మధు తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ అవినీతి



పరిమితికి మించి అధిక లోడుతో గ్రావెల్‌ను రవాణా చేస్తున్న టిప్పర్

రవాణాశాఖలో అవినీతి 'ఓవర్' అయింది. ఓవర్ లోడ్ లారీలు, టిప్పర్లు ఈ శాఖకు కాసుల పంట పండిస్తోంది. కేవలం జిల్లా పరిధిలోని మట్టి, గ్రావెల్, ఫ్లైయాష్, క్వార్ట్జ్ రవాణా చేసే వాహనాల ద్వారానే నెలకు రూ.లక్షల్లో ముడుపులు దండుకుంటున్నారు. అధిక లోడ్ వాహనాలకు చలానాలు రాయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. మరో వైపు అధిక లోడ్ వాహనాల రాకపోకలతో రహదారులు ధ్వంసం అవుతున్నాయి. వీటికి ఏడాదికి రెండుసార్లు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి అనివార్యమవుతోంది.

- రవాణాశాఖకు కాసుల పంట
- జిల్లాలో 400కు పైగా లారీలు, టిప్పర్లు
- నెలకు రూ.72 లక్షలకు పైగా నెలవారీ మామూళ్లు
- వసూళ్లకు ప్రత్యేక సిబ్బంది
- రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

» అధిక లోడుతో గ్రావెల్, మట్టి, క్వార్ట్జ్, ఫ్లైయాష్ రవాణా

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యానికి జిల్లా రవాణాశాఖ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. అనధికార ఆదాయమే పరమావిధిగా ఆ శాఖాధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. జిల్లాలో గ్రావెల్, మట్టి, క్వార్ట్జ్, ఫ్లైయాష్, బొగ్గు తదితర మెటీరియల్స్ రవాణా చేసే సుమారు 400 పైగా లారీలు, టిప్పర్లు ఉన్నాయి. అయితే కొంత మంది వాహన యజమానులు అధిక లోడుతో వీటిని రవాణా చేస్తుంటారు. ఇదే రవాణా అధికారులకు ఆదాయ వనరుగా మారింది. సాధారణంగా 10 టైర్ల వాహనానికి 28 టన్నులు, 12 టైర్లకు 35 టన్నులు, 14 టైర్లకు 42 టన్నులు, 16 టైర్లకు 47.5 టన్నులు రవాణాకు అనుమతి ఉంది. అయితే వాహన యజమానుల విజ్ఞప్తి మేరకు సుప్రీంకోర్టు అన్ని వాహనాలకు అదనంగా 5 శాతం ఓవర్‌లోడ్ రవాణాకు అనుమతి ఇచ్చింది. ఇక ట్రాలీలు, బంకర్లు తదితర వాటికి సింగిల్ యాక్సిల్‌కు 45 టన్నులు, డబుల్ యాక్సిల్‌కు 55 టన్నుల వరకు పరిమితి ఉంది. అయితే ఈ వాహనాల్లో వాహన పరిమితికి మించి ఒక్కో లారీకి 25 నుంచి 40 టన్నుల వరకు ఓవర్ లోడ్‌తో రవాణా చేస్తుంటారు. వాహనంలో అధిక లోడు ఉన్నట్లయితే రూ.20 వేలు ఫెనాల్టీతో పాటు ప్రతి టన్నుకు రూ.2 వేల వంతున వసూలు చేయాలి. పెనాల్టీల రూపంలో విధించే మొత్తం ప్రభుత్వానికి చేరుతుంది.

ఒక్కో వాహనానికి ఒక్కో అధికారికి రూ.1,200 ప్రధానంగా జిల్లాలో ఆత్మకూరు, కోవూరు, కావలి, వెంకటాచలం మండలాల్లో గ్రావెల్ గనులు ఉన్నాయి. పొదలకూరు, రాపూరు మండలాల్లో అధికంగా దొరికే క్వార్ట్జ్ చెన్నైకు రవాణా చేస్తుంటారు. ముత్తుకూరు మండలంలోని విద్యుత్ ప్లాంట్లు నుంచి ఫ్లైయాష్‌ను ప్రొద్దుటూరు, కడప, కమలాపురం ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. అయితే వాహన పరిమితికి మించి అధిక లోడుతో రవాణా చేస్తున్న వాహనాలకు సంబంధించి ధరలు నిర్ణయించారు. ఒక్కో లారీ నుంచి ఒక్కో అధికారికి నెలకు రూ.1,200 వసూలు చేస్తున్నారు. నెల్లూరు నగరంలో రవాణాశాఖ ఉన్నతాధికారితో పాటు ఆర్టీఓ, నలుగురు ఎంవీఐలు, ముగ్గురు ఏఎంవీఐలు ఉన్నారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఇద్దరు ఎంవీఐలు, ఆత్మకూరు, కావలిలోని ఆర్టీఓతో పాటు ఒక ఎంవీఐ, ఒక ఏంవీఐలు ఉన్నారు. ఈ లెక్కన జిల్లాలో మొత్తం 15 మంది రవాణా అధికారులు ఉన్నారు. ఒక్కో లారీకి రూ.18 వేలు వంతున నెల నెలా మామూళ్లు అందజేస్తున్నారు. అధిక లోడుతో తిరుగుతున్న 400 లారీలకు రూ.18 వేలు లెక్కన నెలకు రూ.72 లక్షలు చేతులు మారుతున్నాయి. ప్రత్యేకంగా గూడూరు, సూళ్లూరుపేట, చెక్‌పోస్టుతో పాటు పోలీసు, విజిలెన్స్‌కు చెల్లించినట్లయితే ఈ మొత్తం పెరుగుతుంది.

వసూళ్లకు ప్రత్యేక సిబ్బంది

నెలవారీ మామూళ్లు వసూలు చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. గతంలో రవాశాఖ అధికారి దగ్గర పనిచేసిన డ్రైవరు, హోంగార్డుగా పని చేసిన వ్యక్తి, వీరితో పాటు రవాణాశాఖలో అందరి అధికారుల వ్యక్తిగత పనులు చక్కబెట్టే మరో వ్యక్తి కలిపి ఈ నెలవారీ మామూళ్ల వసూళ్ల బాధ్యతలు తీసుకున్నారు. ఒక్కో లారీకి, ఒక్కో అధికారికి సంబంధించి వసూలు చేసినందుకు రూ.100 వీరికి కమీషన్ ఇస్తుంటారు. అధిక లోడ్‌తో వాహనాలు తిరుగుతుండడంతో రాష్ట్ర రహదారులు దారుణంగా దెబ్బతింటున్నాయి. అదే అధికలోడు వాహనాలపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేసినట్లుయితే రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుంది. మరో వైపు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం ఏటా రూ.కోట్ల ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

రూ.10 కోట్ల జరిమానా వసూలు



2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1,300 ఓవర్‌లోడ్ వాహనాలపై కేసులు నమోదు చేశాం. వీటి నుంచి రూ.10 కోట్ల మేర అపరాధ రుసుం వసూలు చేశాం. ప్రభుత్వం విధించిన రాబడి లక్ష్యం రూ.319 కోట్లకు ఇప్పటి వరకు రూ.180 కోట్ల మేర ఆదాయం వచ్చింది. దాదాపు 70 శాతం లక్ష్యానికి చేరుకున్నాం. ఈ రెండు నెలల్లో మిగిలిన 30 శాతం టార్గెట్‌ను కూడా పూర్తి చేస్తాం. ఓవర్‌లోడ్‌లకు సంబంధించి ఎక్కడా మామూళ్లు తీసుకోవడం లేదు. ఓవర్‌లోడ్ ఉన్న ప్రతి వాహనంపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేస్తాం. – బి.చందర్, డీటీసీ

➡ ఆత్మకూరు వద్ద అధిక లోడుతో గ్రావెల్‌ను రవాణా చేస్తున్న ఓ టిప్పర్‌ను రవాణా అధికారి ఆపి తనిఖీ చేశారు. మామూలు ఇస్తున్న వాహనాల జాబితాలో ఈ లారీ నంబర్ లేదు. దీంతో ఈ టిప్పర్‌కు కేసు రాసేందుకు అధికారి పూనుకున్నారు. ప్రతి నెలా మామూలు ఇస్తున్నామని, ఈ నెల కొంత ఆలస్యమైందని డ్రైవర్ చెప్పినా సదరు అధికారి వినలేదు. దీంతో నెలనెలా మామూలు అందజేసే మధ్యవర్తి ద్వారా ఆ అధికారికి ఫోన్ చేసి చెప్పించడంతో సరే ఇప్పటికి వదిలివేస్తున్నాం. ఈ సారి నుంచి ప్రతి నెలా 15వ తేదీకల్లా మామూలు ఇచ్చేయాలి.. లేకుంటే ఎవరు చెప్పినా వినేది లేదని హెచ్చరించారు.

➡ ముత్తుకూరు నుంచి నెల్లూరుకు ఓవర్‌లోడ్‌తో వస్తున్న ఫ్లై యాష్ బల్కర్‌ను ఓ రవాణా అధికారి తనిఖీ చేశారు. వెంటనే తన దగ్గర ఉన్న మామూళ్లు ఇచ్చే వాహనాల నంబర్ల జాబితాలో ఈ బల్కర్ నంబర్ ఉండడంతో అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ పరిస్థితి ఏ రెండు మూడు టిప్పర్లో, బల్కర్లో కాదు. జిల్లాలో 400కు పైగా లారీలు, టిప్పర్ల నుంచి రవాణాశాఖ అధికారులకు నెలవారీ మామూలు అందుతున్న పరిస్థితి ఉంది.

నిఘా, చర్యలు శూన్యం

గతంలో రవాణాశాఖలో జరిగే అవినీతిపై ఏసీబీ, విజిలెన్స్ తనిఖీలు తరచూ జరిగేవి. దాడులు చేసిన ప్రతి సందర్భంలో అక్రమంగా వసూలు చేసిన సొమ్ము పట్టుబడేది. దీంతో ఆ శాఖ అధికారులు అవినీతికి కొత్త మార్గాలు ఎంచుకున్నారు. తమకు విధేయులుగా ఉండే ప్రైవేట్ వ్యక్తులతో నెలనెలా మామూళ్లు వసూలు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో ఏసీబీ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు కూడా లేకపోవడంతో రవాణాశాఖ అధికారుల అవినీతికి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కనీసం రవాణాశాఖ అధికారుల ఇళ్లపై దాడులు చేసినా.. అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉందని కొన్ని వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

చిన్నారికి పెద్ద జబ్బు

ఆ చిన్నారికి పెద్ద జబ్బు చేసింది. ఆ పేద గిరిజన కుటుంబానికి పెద్ద కష్టం ఏర్పడింది. కూలీనాలీ చేసుకుని ఏ రోజుకారోజు పూట గడుపుకునే ఆ తల్లిదండ్రులు రూ.లక్షలు ఖర్చు చేసి తమ బిడ్డకు ఆపరేషన్ చేయించలేక తల్లడిల్లుతున్నారు. మరో వైపు బిడ్డ పడే వేదన చూడలేక కుమిలిపోతున్నారు. ఈ వైద్యానికి ఆరోగ్యశ్రీలో అవకాశం లేకపోవడంతో సాయం కోసం వదాన్యుల వైపు ఆర్తిగా ఎదురుచూస్తోంది.

- కడుపులో ఇన్‌ఫెక్షన్‌కు ఆపరేషన్ తప్పనిసరి
- వైద్యానికి రూ.6 లక్షల అవసరం
- తల్లడిల్లుతున్న పేద గిరిజన కుటుంబం
- ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న యశ్వంత్ అభిరామ్



కడుపులో ఇన్‌ఫెక్షన్ చేరిన దృశ్యం

ఉలవపాడు: ఉలవపాడులోని వరిగచేను సంఘం ఎస్టీ కాలనీకి చెందిన మానికల మురళి, అపురూప దంపతులకు రెండేళ్ల కుమారుడు జశ్వంత్ అభిరామ్. అభిరామ్‌కు 15 రోజుల క్రితం కడుపులో నొప్పిగా ఉండడంతో స్థానికంగా ఆర్‌ఎంపీ వద్ద, ప్రభుత్వ వైద్యశాలలో చూపించారు. మందులు వాడారు. అయినా ఉపయోగం లేకుండా పోయింది. పొట్ట లావుగా మారడంతో విపరీతమైన కడుపు నొప్పి భరించలేక పిల్లాడు అల్లాడుతుంటే ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలలో చూపించారు. వైద్యులు పరీక్షలు చేసి కడుపులో పూర్తిగా ఇన్‌ఫెక్షన్ అయి చీము చేరిందని, వెంటనే ఆపరేషన్ చేయాలని తేల్చారు. అక్కడి వైద్యులు తక్షణమే విజయవాడలోని అంకుర హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. చేతిలో డబ్బులు లేకపోవడంతో సంఘంలో స్థానికులు డబ్బులు తలా కొంత వేసుకుని వైద్యశాలకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అక్కడ ఇన్‌ఫెక్షన్ సోకిందని కడుపులోని చీమును తొలగించారు. అయినా మళ్లీ ఏర్పడుతూనే ఉంది. ఊపిరితిత్తులు, గుండెకు కూడా ఇన్‌ఫెక్షన్ చేరిందని వైద్యులు తెలిపారు. త్వరగా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఈ ఆపరేషన్ ఆరోగ్యశ్రీ పరిధిలో లేకపోవడంతో భారీగా నగదు వెచ్చించలేక ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

సాయం కోసం ఎదురుచూపులు

నిరుపేద గిరిజన కుటుంబం కావడంతో ఒక్కగానొక్క బిడ్డను కాపాడుకోవడం కోసం ఆ తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఆపరేషన్‌కు రూ.6 లక్షల వరకు అవసరం కావడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. దాతలు ఆదుకుంటేనే ఆ రెండేళ్ల బిడ్డ సంతోషంగా తిరిగి వస్తాడు. విజయవాడలోని ఆ ప్రైవేట్‌లోని వైద్యులు సైతం ముందుగా వారి పరిస్థితి గమనించి వారే కొంత నగదు సర్దుబాటు చేసి మందులు ఇచ్చారు. సాయం చేయాలనుకునే దాతలు తన తమ్ముడు అశోక్ ఫోన్‌పే నంబర్ 6301120664 ద్వారా సాయం అందించాలని కోరుతున్నారు.

నేరాల కట్టడికి చర్యలు

- జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు
- డ్రగ్స్ రహిత సమాజం కోసం అవగాహన సదస్సులు



బుచ్చిరెడ్డిపాలెం సెంటర్‌లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న స్థానిక సీఐ రామారావు

నెల్లూరు (క్రైమ్): ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశాల మేరకు నేరాల కట్టడే లక్ష్యంగా పోలీసు, సెబ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, పేకాట, కోడి పందేలు, బహిరంగ మద్య సేవనంపై దాడులు చేశారు. వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టస్తున్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా యువత మేలుకో–భవితను మలుచుకో–డ్రగ్స్ వదులుకో, డ్రగ్స్ రహిత సమాజం–సంక్షేమానికి సంకేతం అంటూ ప్రతిస్టేషన్ పరిధిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య వంతులను చేస్తున్నారు. బహిరంగ మద్య సేవనం చేసే వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సీహెచ్ విజయారావు మాట్లాడుతూ నేరాలను పూర్తి స్థాయిలో కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. 2022 నుంచి ఇప్పటి వరకు పేకాట కేంద్రాలపై దాడులు చేసి 129 కేసులను నమోదు చేసి 690 మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. 57 వాహనాలు, 56 సెల్‌ఫోన్లు, రూ.23,89,922 నగదును సీజ్ చేశామన్నారు. కోడి పందేలపై 107 కేసులు నమోదు చేసి 498 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 152 వాహనాలు, 24 మొబైల్స్, రూ.5,90,178 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నేర నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై డయల్ 100 లేదా, స్థానిక పోలీసులకు, 14500కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

- ఆర్‌జేడీ సుబ్బారావు



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

గుడ్లూరు: పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని విద్యాశాఖ గుంటూరు ఆర్జేడీ సుబ్బారావు అన్నారు. పదో తరగతి విద్యార్థుల పురోగామి స్టడీ అవర్స్‌లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న భౌతికశాస్త్ర స్టడీ అవర్స్‌ను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల భౌతికశాస్త్ర నోట్స్, ఎగ్జామ్ నోట్స్‌లను పరిశీలించారు. పదో తరగతి పరీక్షలు 57 రోజులు ఉన్నాయని విద్యార్థులు ఆరు సబ్జెక్ట్‌లను విభజించుకుని చదువుకుంటే ఏ విద్యార్థి ఫెయిల్ కారన్నారు. ఇష్టపడి కష్టంతో చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను పదో తరగతి నుంచే విద్యార్థులు చేరుకోవచ్చని సూచించారు. పదో తరగతిలో మంచి మార్కులతో మొదటి స్థానంలో వచ్చే విద్యార్థులకు తాను వ్యక్తిగతంగా బహుమతులు అందజేస్తానని తెలిపారు. విద్యార్థులకు పలు సూచనలను చేశారు. స్టడీ అవర్స్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూడా పదోతో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. ఆర్జేడీ వెంట భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు కాపులూరు వెంకటేశ్వర్లు, వల్లెపు మురళీ ఉన్నారు.

నాకెందుకు శాపం.. నేనేమి చేశాను పాపం!

'దేవుడా..! నాకెందుకు ఈ శాపం.. నేనేమి చేశాను పాపం.. నన్ను కూడా తీసుకెళ్లితే బావుండు.. నేను ఎవరి కోసం బతకాలి.. నేనెందుకు బతకాలి..' అంటూ ఆ ఇల్లాలు గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. కళ్లెదుటే విగతజీవులుగా పడి ఉన్న భర్త, ఇద్దరు పిల్లలను చూసి తల్లడిల్లిపోయింది. కళ్లల్లో నీళ్లు ఇంకిపోయే వరకు ఏడ్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలు దూరమవడాన్ని తట్టుకోలేకపోయింది. వారి తల నిమురుతూ.. పదేపదే ముద్దాడుతూ గుండెలు పగిలేలా రోదించింది. ఈ ఘటన రాపూరు మండలం గుండవోలులో ఆదివారం విషాదాన్ని నింపింది.

- రోడ్డు ప్రమాదంలో భర్త, కుమార్తె మృతి
- చికిత్స పొందుతూ కుమారుడూ మృతి
- ఒకేసారి ముగ్గురికి అంత్యక్రియలు
- తల్లడిల్లిపోయిన ప్రభావతి
- శోకసముద్రంలో గుండవోలు గ్రామం



సిద్ధార్థ (ఫైల్)



ప్రతాప్ (ఫైల్)



వైష్ణవి (ఫైల్)

రాపూరు: మండలంలోని వెలుగోను జంక్షన్ నుంచి ఏపూరు వెళ్లే జాతీయ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబంలో పెను విషాదాన్ని నింపింది. ప్రమాదంలో తండ్రి, కుమార్తె అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అంతవరకు తనతో ఉన్న భర్త, ఇద్దరు పిల్లలను పోగొట్టుకున్న ఆ ఇల్లాలు షాక్‌కు గురై కుప్పకూలిపోయింది. మోటారు బైక్‌పై గంగోటి ప్రతాప్ తన కుమార్తె వైష్ణవి, కుమారుడు సిద్ధార్థతో కలిసి గుండవోలుకు బయల్దేరారు. ఎదురుగా వస్తున్న ఇన్నోవా కారు ఢీకొనడంతో ప్రతాప్, వైష్ణవి, అక్కడికక్కడే మృతి చెందగా గాయపడిన సిద్ధార్థను వైద్యం నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సిద్ధార్థ (8) ఆదివారం మృతి చెందాడు.

కుప్పకూలిన ప్రభావతి

భర్త, పిల్లలు ఒకేసారి మృత్యువాత పడడంతో ప్రభావతి కుప్పకూలింది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ప్రతాప్ (38) ముంపు గ్రామానికి చెందినవాడు కావడం త్వరలో ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఉన్న కుటుంబానికి నిరాశే మిగిలింది. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉంటున్న కుటుంబంలోని ముగ్గురూ మృత్యువాత పడడంతో వృద్ధ తల్లిదండ్రులతోపాటు గ్రామం అంతా విషాదంలో మునిగింది.

ఒకేసారి ముగ్గురికి అంత్యక్రియలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రతాప్, వైష్ణవి, సిద్ధార్థకు ఆదివారం గ్రామంలో ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు రోదనలతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.



కమలమ్మను తీసుకెళ్తున్న పోలీస్ సిబ్బంది (ఫైల్)

• జిల్లాలోని ఓ మండలానికి చెందిన కమలమ్మకు ఐదుగురు సంతానం. భర్త కొంతకాలం క్రితం మృతిచెందాడు. బాగోగులు తామే చేసుకుంటామని ఆమె పేరుపై ఉన్న ఆస్తిని పిల్లలు రాయించుకున్నారు. అనంతరం పట్టించుకోవడం మానేశారు. పూరిగుడిసెలో ఉంటూ ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బుతో కమలమ్మ జీవిస్తోంది. అనారోగ్యం వెంటాడుతోంది. తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.

• నెల్లూరుకు చెందిన పద్మమ్మ భర్త మృతిచెందాడు. కొడుకు, కోడలు నమ్మకంగా ఉంటూ తామే చూసుకుంటామని ఆమెను నమ్మించి ఓ ప్రాంతంలో ఉన్న ఆస్తిని తమపేరు మీద రాయించుకున్నారు. అనంతరం ఆమెను ఇంట్లో నుంచి గెంటేశారు. దీంతో బాధితురాలు స్పందన కార్యక్రమంలో పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు.

• ఓ మండలానికి చెందిన ఆదినారాయణరెడ్డి తన పిల్లలకు ఆస్తులను సమానంగా పంచాడు. తనపేరు పైనున్న ఆస్తిని సైతం తమకే రాసివ్వాలని కుమారులు అతడిపై దాడి చేస్తున్నారు. కుమారుల బారి నుంచి తనను రక్షించాలని స్పందనలో బాధితుడు ఫిర్యాదు చేశారు.

• ఓ మండలానికి చెందిన కావమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. అందరికీ వివాహాలు చేశారు. ఆమె భర్త మరణించాడు. వయసు పైబడింది. నడవలేని స్థితిలో ఉంటే కోడలు, కొడుకు పట్టించుకోలేదు. తన పేరుపైన 84 సెంట్ల భూమిలో కొంత అమ్ముకుని వచ్చిన సొమ్ముతో బతుకుతానని చెప్పినా అంగీకరించలేదు. న్యాయం చేయాలని కోరుతూ కావమ్మ స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

కన్నబిడ్డల ఆదరణ కరువై..



• పాపం పండుటాకులు
• ఆస్తి కోసం ఇబ్బంది పెడుతున్న పిల్లలు
• ఇంటి నుంచి గెంటేస్తున్న వైనం
• పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

నెల్లూరు(క్రైమ్): తల్లిదండ్రులు తమ పిల్లలను అల్లారుముద్దుగా పెంచి వారిని ప్రయోజకులు చేయాలని అహర్నిశలు శ్రమిస్తారు. తిన్నా, తినకపోయినా రూపాయి రూపాయి కూడబెట్టి ఆస్తులు సంపాదించి పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తారు. వారు ఎదుగుతుంటే చూసి మురిసిపోతారు. నిత్యం పిల్లల కోసం పరితపిస్తారు. అయితే ఎదిగొచ్చిన కొందరు పిల్లలు తల్లిదండ్రులకు నరకం చూపిస్తున్నారు. ప్రయోజకులను చేసిన కన్నవాళ్లకు గుప్పెడు మెతుకులు పెట్టకుండా నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఆస్తులు రాయించుకునే వరకు కంటికి రెప్పలా చూసుకుంటామని నమ్మించి ఆపై నడిరోడ్లోకి గెంటేస్తున్నారు. వృద్ధులైన తల్లిదండ్రులు తమకు అడ్డుగా ఉన్నారంటూ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టేవాళ్లు కొందరైతే.. ఉన్న ఆస్తులు రాయాలంటూ బెదిరించేవారు మరికొందరు.. జీవితం మొత్తం వారి ఎదుగుదలకు కష్టపడి పెంచి పెద్ద చేయడమే కాకుండా సంపాదించిన మొత్తాన్ని ఇచ్చినా ఇంకా ఆశతో వేధించేవాళ్లు ఇంకొందరు.. మలివయసులో తలదాచుకునేందుకు ఇల్లు ఉంచుకుంటే దానిని సైతం తమకు ఇచ్చేయాలని చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఆస్తులు రాసిచ్చినా మిగిలిన స్థలాల కోసం కొందరు దాడులకు తెగబడుతున్నారు. ఇలా అనేకమంది పండుటాకులు తమ కన్నీటి గాథలను స్పందన కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు.

నెలకు 20కిపైగా ఫిర్యాదులు

కడుపున పట్టిన వారు వేధిస్తున్నారని, ఆస్తులు రాయాలంటూ దాడులు చేస్తున్నారని, ఆస్తి రాయించుకుని ఆపై ఇంటి నుంచి గెంటేస్తున్నారని ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమంలో అనేకమంది ఎస్పీ, ఇతర పోలీసు అధికారులకు విన్నవించి కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రతి వారం స్పందనకు ఈ తరహాలో 4 నుంచి 5 ఫిర్యాదులు అందుతున్నాయి. నెలకు 20 మందికిపైగా కన్నబిడ్డల కాఠిన్యంపై పోలీసు అధికారుల దృష్టి తెస్తున్నారు.

ఈ చట్టం వృద్ధుల పాలిట వరం

తల్లిదండ్రులు, వయో వృద్ధుల సంరక్షణ చట్టం–2007 పండుటాకుల పాలిట వరం. ఈ చట్టం కింద రక్షణ, మెయింటెనెన్స్ పొందవచ్చు. నిర్లక్ష్యానికి గురైన వారు నేరుగా సబ్ కలెక్టర్/ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ట్రిబ్యునల్‌లో కేసు వేయొచ్చు. అలాగే అనాథాశ్రమాలు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ల ద్వారా కూడా ట్రిబ్యునల్‌లో కేసు వేసే అవకాశం ఉంది. కేసును విచారించే ఆర్డీఓలు వారి జీవనానికి ఇబ్బంది లేకుండా, సంరక్షణను పిల్లలు చూసుకునేలా తీర్పులిస్తారు. రూ.10 వేలు మెయింటెనెన్స్ ఇవ్వాలని చట్టం పేర్కొంది. పిల్లలు బలవంతంగా ఆస్తులు రాయించుకుంటే చట్టంలోని సెక్షన్–23 కింద ఆ రిజిస్ట్రేషన్ (సేల్ డీడ్ మినహా) రద్దు చేసే అవకాశం ఉంది. సెక్షన్–24 ప్రకారం నిర్లక్ష్యం చేసినా, వారిని హింసించినా, దాడి చేసినా మూడునెలలు జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా లేదా రెండు విధిస్తారు.

కౌన్సెలింగ్ ఇస్తున్నాం



తల్లిదండ్రులను వేధించే కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత పిల్లలను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటేసినా, ఆస్తి కోసం చిత్రహింసలకు గురిచేసినా, భోజన, వసతి సౌకర్యాలు కల్పించకపోయినా వయో వృద్ధుల సంరక్షణ చట్టం (సీనియర్ సిటీజన్స్ యాక్ట్) కింద నేరం. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు. తల్లిదండ్రుల కేసులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించాం.

– సీహెచ్ విజయారావు, ఎస్పీ

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం తగదు



కొందరు పిల్లలు తల్లిదండ్రుల సంక్షరణను విస్మరిస్తున్నారు. ఆస్తి కోసం చిత్రహింసలకు గురిచేయడంతోపాటు ఇంట్లో నుంచి బయటకు గెంటేస్తున్నారు. వారి బాగోగులు చూడటం నైతిక బాధ్యత. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం చట్ట ప్రకారం నేరం. సీనియర్ సిటీజన్ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవు.

– గుర్రం అరుణ్‌కుమార్, న్యాయవాది

క్లుప్తంగా

కరాటేలో నెల్లూరీయుల ప్రతిభ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఆదివారం ముగిసిన 3వ జాతీయ ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరుకు చెందిన చిన్నారులు ప్రతిభ చూపారు. అయ్యప్పగుడి సెంటర్‌కు చెందిన షేక్ అనస్తకీ, షేక్ అన్నీష కరాటేలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభ చాటారు.

నేడు ఎంపీ ఆదాల రాక

• ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు
• పాల్గొననున్న మంత్రి కాకాణి, కో–ఆర్డినేటర్ బాలినేని



ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం నెల్లూరుకు రానున్నారు. నగరంలోని అయ్యప్పగుడి దగ్గర నుంచి మినీబైపాస్‌రోడ్డులోని ఆదాల అతిథిగృహం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ర్యాలీ సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమవుతుంది. నెల్లూరు రూరల్‌లోని అధికార పార్టీ కార్పొరేటర్లు స్వాగత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆదాల సమన్వయకర్తగా నియమితులైన తర్వాత మొదటిసారి వస్తుండటంతో రూరల్లోని అన్ని డివిజన్ల నాయకులు, కార్యకర్తలతోపాటు మండలంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు తరలివచ్చి స్వాగతం చెప్పనున్నారు. ఈ ర్యాలీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మరో రాజ్యసభసభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 97
లేయర్ (లైవ్) : 80
బ్రాయిలర్ చికెన్ : 176
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 196
లేయర్ చికెన్ : 136

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.32
సన్నవి :	రూ.22
పండ్లు :	రూ.8

వివాహిత అనుమానాస్పద మృతి

• భర్త, అతని కుటుంబసభ్యులే ఉరేశారు
• బాధిత తల్లిదండ్రుల ఆరోపణ



దివ్య మృతదేహం



రాపూరులో విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

గుడ్లూరు: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మండలంలోని రాపూరులో శనివారం సాయంత్రం జరగ్గా ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివాహం జరిగి ఆరునెలలే అయ్యిందని, అదనపుకట్నం ఇవ్వలేదని భర్త, ఆమె కుటుంబసభ్యులే తమ కుమార్తెను చంపి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని బాధిత తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. దగదర్తి మండలం బోడగుడిపాడు గ్రామానికి చెందిన పోలుబోయిన రఘురామయ్య కుమార్తె దివ్య (21)కు గుడ్లూరు మండలంలోని రావూరు గ్రామానికి చెందిన గొల్లప్రోలు వెంకటసుబ్బారావు కుమారుడు వెంకట రాజేంద్రతో ఆరునెలలు క్రితం వివాహమైంది. ఆ సమయంలో 18 సవర్ల బంగారం, ఎకరా పొలం, రూ.50 వేల నగదు కట్నంగా ఇచ్చారు. అయితే దివ్యకు ఎడమచెయ్యి కొంచెం అంగవైకల్యం ఉంది. ఈక్రమంలో కొద్దిరోజుల నుంచి అదనపుకట్నం తీసుకురావాలని భర్త, అత్త, కుటుంబసభ్యులు ఆమెను వేధిస్తూ వచ్చారు.

ఎలా ఉరేసుకుంటుంది?

శనివారం సాయంత్రం దివ్య (21) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని చెబుతున్నారు. చుట్టుపక్కల వారు గమనించి కిందకు దించి పనికి వెళ్లి భర్త, అత్తకు సమాచారం ఇచ్చారు. రాత్రి 9 గంటలకు దివ్య తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు గ్రామానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బారావు, ఎస్సై ప్రసాద్‌రెడ్డి రావూరుకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. తమ కుమార్తె ఎడమచేతికి అంగవైకల్యం ఉందని, ఆమె ఎలా ఉరేసుకుంటుందని, రాజేంద్ర, అతని కుటుంబసభ్యులు అదనపు కట్నం కోసం చంపి ఉరేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని బాధిత తల్లిదండ్రులు రఘురామయ్య, మాధవి అనుమానం వ్యక్తం చేశారు.

కేసు తీసుకోలేదు

శనివారం రాత్రి 11.30 గంటలకు గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పోలీసులు ఆదివారం ఉదయం 6 గంటలు వరకు కూడా ఫిర్యాదు తీసుకోలేదని రాత్రంతా స్టేషన్ బయటే ఉండమన్నారని దివ్య తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. పోలీసులు నిష్పక్షపాతంగా కేసును విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కందుకూరు డీఎస్పీ కండె శ్రీనివాసరావు ఆదివారం గ్రామానికి చేరుకుని ఘటనా స్థలంలో విచారించారు. వరకట్న వేధింపుల కింద రాజేంద్ర, అతని తల్లి రామతులసమ్మ మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.

కష్టపడితే విజయం మీ సొంతం

• ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు



పురస్కారాలను అందుకున్న వారితో కళాశాల యాజమాన్యం

నెల్లూరు(టౌన్): కష్టపడితే విజయం మీ సొంతమవుతుందని ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు అన్నారు. విశ్వసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్‌ఐఓ మాట్లాడుతూ విశ్వసాయి విద్యాసంస్థల్లో చదివిన ఎంతోమంది ప్రముఖ ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలు పొంది తల్లిదండ్రులు గర్వపడేలా చేశారని కొనియాడారు. ఎంత కష్టపడినా ఒక్కోసారి ఫలితం దక్కదని, అంత మాత్రాన కుంగిపోకుండా మరోసారి ప్రయత్నించి ఫలితం సాధించాలన్నారు. విలువలు, వ్యక్తిత్వం ఎంతో ముఖ్యమని, వాటితో ఎందరో ఉన్నతంగా ఎదిగారని చెప్పారు. డీఈఓ మధుబాబు మాట్లాడుతూ చదువు, క్రీడలతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లోనూ ప్రావీణ్యం సంపాదించాలన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో ముందుండేలా చదువు సాగిస్తే పోటీ ప్రపంచంలో గొప్పగా రాణించవచ్చన్నారు. కళాశాల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ చదువు చేతిలో ఉంటే ఎన్ని విజయాలైన సొంతం చేసుకోవచ్చన్నారు. అనంతరం విశ్వసాయిలో చదివి మెడికల్ సీట్ సాధించి ఆర్థోపెడిక్ సర్జన్‌గా పని చేస్తున్న డాక్టర్ వివేకానందరెడ్డి తన అనుభవాలను విద్యార్థులు, తల్లిదండ్రులతో వివరించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ రుక్మిణి, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.